నియో ఆహార్‌ను ప్రారంభించిన తనికెళ్ల భరణి

సిటీబ్యూరో, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): భోజన ప్రియత్వమంటే అతిహారం కాదనీ, మితహారాన్నే సంపూర్ణంగా షడ్రశోపితంగా, మనస్ఫూర్తిగా స్వీకరించడమని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. టియోనాట్ నియో కేర్ సంస్థ శనివారం నూతన పోషకాహార ఉత్పత్తుల శ్రేణి 'నియో ఆహార్'ను ఘనంగా ప్రారంభించిన సందర్భంగాముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఉత్పత్తులని ప్రారంభించి మాట్లాడారు. రుచికి పోషక విలువల్ని జతచేయడం, ఈ తరానికి తగినట్టుగా 5 నిమిషాల్లోనే సిద్ధం చేయగలగడం అద్భుతమన్నారు. ప్రముఖ దర్శకుడు శ్రీ వి.ఎన్. ఆదిత్య, మాజీ ఆర్టీఐ కమిషనర్, సీనియర్ పాత్రికేయులు శ్రీ పి.విజయ బాబు, టియోనాట్ నియోకేర్ సంస్థ ఎండీ సత్య ప్రసాద్, ప్రముఖులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో మహిళా కమాండోలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 19: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టులో ఇప్పటివరకు పురుషుల కమాండోలను బందోబస్తులో ఉంచగా తాజాగా శనివారం నుంచి వారితో పాటు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా మహిళ కమాండోలను బందోబస్తులో ఉంచినట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టులో వివిధ రకాల సవాళ్లను ఎదుర్కోందుకు వీలుగా నాలుగు వారాల పాటు శిక్షణ ఇచ్చిన 15 మంది మహిళా కమాండోలను నియమించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

0001 నంబర్‌కు రూ.7.75లక్షలు

ఫ్యాన్సీ నెంబర్ బిడ్డింగ్‌లో సొంత చేసుకున్న సినీ నటుడు బాలకృష్ణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఫ్యాన్సీ నెంబర్ బిడ్డింగ్‌లో పాల్గొని.. 0001 నంబర్‌ను రూ.7.75లక్షలకు దక్కించుకున్నారు. ఇటీవల కొనుగోలు చేసిన బీఎండబ్ల్యూ కారు కోసం ఈ నెంబర్‌ను ఆయన దక్కించుకున్నారు. కాగా, ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ఫ్యాన్సీ నెంబర్ల బిడ్డింగ్‌లో రూ.37.15లక్షల ఆదాయం సమకూరిందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సీ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీ09ఎఫ్0009 నెంబర్‌ను రూ.6.70లక్షలకు కమలయ్య హిస్ కంపెనీ దక్కించుకోగా, టీజీ09ఈ9999 నెంబర్‌ను రూ.99,999కు ఎకో డిజైన్ స్టూడియో కైవసం చేసుకుంది. 0005 నెంబర్ రూ.1.37లక్షలు ధర పలకగా, 0005 నెంబర్ రూ.1.49లక్షలు, 0099 నెంబర్ రూ.4.75లక్షల ధర పలికిందని ఆర్టీఏ అధికారులు తెలిపారు.

డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె

ఓయూ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్19: తమ ఉద్యోగాలను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఓయూ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.కార్యక్రమంలో డాక్టర్ ఉపేందర్, డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ పరుశురామ్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశ్, డాక్టర్ పాండయ్య, డాక్టర్ రేష్మా రెడ్డి, డాక్టర్ వినీత పాండే, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్, డాక్టర్ రాజు, డాక్టర్ సత్యం, డాక్టర్ నీరజ పాల్గొన్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యం.. శిశువు మృతి

మేడ్చల్, ఏప్రిల్ 19:శిశువు మృతి చెందిన సంఘనట మేడ్చల్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగింది. డాక్టర్లు చూపిన నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందినట్లు సంబంధికులు ఆందోళనకు దిగారు. వివరాలోకి వెళితే.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుక్కునూరు గ్రామానికి చెందిన వంశీ భార్య శిరీషకు ఈ నెల 15న మేడ్చల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవిచింది. శిశువు బాగా ఏడుస్తోందని, జ్వరం వచ్చిందని శుక్ర వారం వైద్యురాలికి తెలుపగా, చిన్నపిల్లల వైద్యుడు వస్తాడని మూడు గంటల వరకు వేచి చూడాలని సూచించారు. మూడు గంటలైన వైద్యుడు రాలేదు. దీంతో విసిగి పోయిన శిశువు తండ్రి వంశీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో డాక్టర్ పట్టణంలోని మెడినోవ ఆస్పత్రిలో ఉన్నారని, అక్కడికి వెళ్లాలని సూచించింది. శిశువును తీసుకొని తండ్రి ఆ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించాడు. పరిస్థితి విషమంగా ఉందని నగరానికి తీసుకువెళ్లాలని చెప్పారు. వైద్యుల సూచనలు మేరకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే నవ జాత శిశువు చనిపోయింది. బాధితులు తిరిగి మేడ్చల్ ఆస్పత్రికి చేరుకొని ఆందోళన చేశారు. ఈసందర్భంగా శిశువు తండ్రి మాట్లాడుతూ శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంటే వైద్యులు పట్టించుకోక పోవడం దారుణం అని అన్నారు. ఈ విషయమై వైద్యుడు సుధీర్ కుమా ర్ ను వివరణ కోరగా శుక్రవారం సెలవు కావడంతో రాలేదన్నారు.కానీ హాజరు అయినట్లు రిజిస్టర్ ఉందని సమయానికి స్పందించక పోవడంతో ఇలా జరిగిందని బాధితులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

రోగులకు సహాయకులేరి..?

- ఉస్మానియా ఆసుపత్రిలో నర్సుల కొరత
- మందులు, చికిత్స వివరాలు చెప్పేవారు లేక రోగుల ఇక్కట్లు
- ఖాళీల భర్తీలో జాప్యం చేస్తున్న సర్కార్

సిటీబ్యూరో, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): వేలాది ప్రాణాలను కాపాడటంతో పాటు నిరుపేదలకు వైద్య ప్రదాయినిగా పేరు గాంచిన ఉస్మానియా ఆసుపత్రిలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఆసుపత్రిలో నర్సులు, సహాయకులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. 1,168 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం 1,072 పడకలు అందుబాటులో ఉన్నాయి. వీళ్లందరికి వైద్య సేవలందించాల్సిన నర్సింగ్ అధికారి పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ప్రభుత్వం ఉద్యోగాలకు ప్రకటన జారీచేసి చేసినప్పటికీ ఇప్పటివరకు భర్తీ చేయకపోవడంతో 125 నర్సుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పోస్టుల భర్తీలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండటంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అలాగే సిబ్బంది కొరత వల్ల ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న వాళ్లపై అధిక భారం పడుతోంది.

నిత్యం 3వేల ఓపీ సేవలు..

ఉస్మానియా ఆసుపత్రికి నిత్యం సుమారు 3వేల మంది ఔట్ పేషెంట్లు వస్తుండగా, ఇన్ పేషెంట్లు 1200 వరకు వస్తుంటారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఉస్మానియాకు వచ్చే వారికి వైద్య సేవలందించడంలో నర్సుల పాత్ర ప్రముఖమైంది. వీరు రోగికి సహాయకరంగా ఉండటంతో పాటు, మందులు, చికిత్స తదితర సేవలందిస్తుంటారు. ఉస్మానియా ఆసుపత్రిలో ప్రస్తుతం 385 మంది నర్సులకు గాను, 375 మంది అందుబాటులో ఉన్నారు. ఈ 375 మందిలో 60 మంది డిప్యూటేషన్‌పై వచ్చినవారు, 41మంది టిమ్స్ నుంచి, 17 మంది పీసీఎస్‌పీ నుంచి వచ్చి తాత్కాలికంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సీనియర్ నర్సింగ్ అధికారి, నర్సింగ్ అధికారులు ఇతర జిల్లాలకు వెళ్లారు. దీంతో 125 ఖాళీలు ఏర్పడగా వాటిని ఇప్పటివరకు రెగ్యులర్ వారితో భర్తీచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుంది. ఉస్మానియాలో 288 ఐసీయూ పడకలు, 259 హైరిస్క్ పడకలు, 525 సాధారణ పడకలు ఉండగా వీరందరికి సేవలందించాలంటే ప్రస్తుతం ఉన్న సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారు. డిప్యూటేషన్ మీద వచ్చిన నర్సులు తాత్కాలికంగా కొంత భారం తగ్గించినా అది శాశ్వత పరిష్కారం కాదు. మెరుగైన వైద్యసేవలందాలంటే రెగ్యులర్ నర్సుల భర్తీ అత్యంత అవసరం.

డబ్ల్యూహెచ్‌ఓ ఏం చెబుతోంది..

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్వో), ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రమాణాల ప్రకారం ఐసీయూలో 1:1 నిష్పత్తి ప్రకారం 1 రోగికి ఒక నర్సు, హైరిస్క్ పడకల వద్ద 1:2 నిష్పత్తి ప్రకారం ఇద్దరు రోగులకు ఒక్క నర్సు, జనరల్ వార్డులో 1:5 ప్రకారం ఒక్క నర్సు ఐదు మంది రోగులకు సేవలందించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఉస్మానియా ఆసుపత్రిలో ప్రస్తుతమున్న రెగ్యులర్, డిప్యూటేషన్, పీసీఎస్‌సీ లకు చెందిన 375 నర్సులతో పాటు అదనంగా 140 మంది నర్సులను కచ్చితంగా నియమించాల్సి ఉంది. ఉస్మానియా ఆసుపత్రి పేషెంట్ల కెపాసిటీకి తగినట్లు ప్రస్తుతం మొత్తం 523 మంది నర్సులు వరకు ఆస్పత్రిలో సేవలందించాల్సి ఉంది. అయితే ఖాళీల భర్తీలో కాంగ్రెస్ సర్కార్ తీవ్ర జాప్యం చేయడంతో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వీలైనంత త్వరగా నర్సుల పోస్టులను భర్తీ చేసి ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

చిక్కడపల్లి, ఏప్రిల్ 19: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ సంఘం జేఏసీ నాయకులు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఉద్యమకారుల కార్యాచరణ సమావేశం నిర్వహించారు. రామగిరి ప్రకాష్, గొల్లపల్లి నాగరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, పీఓడబ్ల్యూ సభ్యురాలు సంధ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని స్వరాష్ట్ర సాధనకు కారణమైన ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జేఏసీ సమన్వయ కమిటీ సభ్యుడు రామగిరి ప్రకాష్ మాట్లాడుతూ.. ఉద్యమకారులను గుర్తించి గౌరవప్రదమైన గుర్తింపు కార్డులు, ఆరోగ్య పరిరక్షణకై హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు తెలంగాణ వెంకన్న ముత్తయ్య యాదవ్ , రూబీ స్టీవెన్ సన్, మధుసూదన్, హైదరాబాద్ జన సమితి అధ్యక్షులు మేకపోతుల నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై న్యాయపోరాటం

సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ

ఖైరతాబాద్, ఏప్రిల్ 19: సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ''వక్ఫ్ సవరణ చట్టం, ఎవరి కోసం ?'' అనే అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆ పార్టీ జిల్లా సమితి సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత వహించగా.. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారని తెలిపారు. త్వరలో కేరళలో జరుగనున్న సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఓ విధానపరమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, ఈటీ నరసింహ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. కులాలు, మతాలు పేరుతో ప్రజలను విడదీసే కుట్ర చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త మోటూరి కృష్ణ ప్రసాద్, ఎంబీటీ అధికార ప్రతినిధి అహ్మదుల్లా ఖాన్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, జర్నలిస్టు, రచయిత స్కైబాబా, భారత జాతీయవాదుల ఉద్యమం జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ అలీ జుబేర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ నవీద్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వరంగల్ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఫసీయుద్దీన్, ముస్లిం ఐక్యత అభివృద్ధి ఉద్యమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ సుభాన్, ఆల్ ఇండియా సూఫీ ఉలేమా కౌన్సిల్ అధ్యక్షులు మౌలానా ఖైరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో అల్లెన్ విజయపథం

సిటీబ్యూరో, ఏప్రిల్19(నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ 2025 ఫలితాల్లో అల్లెన్ కోటా విద్యార్థులు సత్తాచాటారు. దేశవ్యాప్తంగా మొత్తం 24 మంది విద్యార్థులు 100 పర్సెంటైల్ స్కోర్ సాధించగా, వారిలో 11 మంది అల్లెన్‌కు చెందినవారు కావడం గమనార్హం. అల్లెన్ కోటా విద్యార్థి ఓం ప్రకాష్ బెహేరా 300 మార్కులకు గాను 300 సాధించి ఆల్ ఇండియా మొదటి ర్యాంకును సాధించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన 7 మంది విద్యార్థులు 100 పర్సెంటైల్ సాధించగా, వారిలో 6 మంది అల్లెన్ తరగతి విద్యార్థులే. అల్లెన్ కు చెందిన 31 మంది విద్యార్థులు టాప్-100 ఆల్ ఇండియా ర్యాంకుల్లో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా అల్లెన్ సీఈఓ నితిన్ కుక్రేజా మాట్లాడుతూ.. ''అల్లెన్ ఎల్లప్పుడూ మెడికల్, ఇంజినీరింగ్, జూనియర్ స్థాయి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ ఉంది. కోటాలోనైనా, ఇతర నగరాల్లోనైనా, ఆన్ లైన్ డిజిటల్ కోర్సుల రూపంలోనైనా, విద్యార్థుల ప్రయోజనమే మా లక్ష్యం'' అని తెలిపారు.

100 పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు

ఓం ప్రకాష్ బెహేరా 1వ ర్యాంక్, సాక్షం జిందాల్ 10వ ర్యాంక్, అర్ణబ్ సింగ్ 11వ ర్యాంక్, రాజిత్ గుప్తా 16వ ర్యాంక్, మహమ్మద్ అనాస్ 17వ ర్యాంక్, లక్ష్య శర్మ 22వ ర్యాంక్, అరిట్రోన్ రాయ్ 51వ ర్యాంక్ (అల్లెన్ డిజిటల్ కోర్సు విద్యార్థి) సాధించారు.

చార్జ్ తీసుకునే సమయంలో వెనక్కి..

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీగా కె.ఎం. కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శనివారం బాధ్యతలు స్వీకరించడానికి ఏసీపీ కార్యాలయానికి వచ్చిన కిరణ్‌కు ఉన్నతాధికారులు పిలుపు వచ్చింది. మళ్లీ వెనక్కు వచ్చేయండంటూ ఆయనను చార్జ్ తీసుకోకుండానే రిటర్న్ పిలిచారు. సీసీఎస్ ఏసీపీగా పనిచేస్తున్న కిరణ్‌కు ఎస్ఆర్‌నగర్‌కు బదిలీ చేసిన తర్వాత కిరణ్ ఒక ప్రముఖమైన కేసు విషయంలో దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కిరణ్ బదిలీ అయితే ఆ స్థానంలో వచ్చే అధికారి మళ్లీ మొదటినుంచి ఈ కేసు దర్యాప్తు చూడాల్సి ఉంటుంది కాబట్టి కేసు దర్యాప్తు నెమ్మదించే అవకాశమున్నందున సీసీఎస్ ఉన్నతాధికారి ఒకరు డీజీపీకి ఈ విషయంలో చొరవ తీసుకుని తిరిగి కిరణ్‌ను వెనక్కు పిలిపించినట్లు తెలిసింది. ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా పనిచేసిన వెంకటరమణ సిటీ సెక్యూరిటీ వింగ్‌కు అదనపు ఎస్పీగా ప్రమోషన్‌పై వెళ్లారు. ఈనేపథ్యంలో ఎస్ఆర్‌నగర్‌కు కిరణ్‌ను పంపగా ఆయన దర్యాప్తు చేస్తున్న కేసు చాలా ముఖ్యమైనది కావడంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

విద్యుత్ సరఫరాలో లైన్‌మెన్లు, ఆర్టిజన్లే కీలకం

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు సంబంధించి లైన్‌మెన్ , జూనియర్ లైన్‌మెన్, ఆర్టిజన్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వీరు సంస్థకు వెన్నెముకలాంటివారని టీజీఎస్‌పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖి అన్నారు. సిబ్బందితో జరుగుతున్న సమన్వయ సమావేశాల్లో భాగంగా శనివారం సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్ సిబ్బందితో జరిగి మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా అందించడంలో రూరల్ సర్కిల్స్ సిబ్బంది ఎంతగానో కృషి చేశారన్నారు. ఈసారి వేసవిలో అర్బన్ సర్కిల్స్ పరిధిలో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో విపరీతంగా విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశముందని, సంస్థాగతంగా అన్ని ఏర్పాట్లు చేసినా సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవలసిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపైనే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సంస్థ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు డా.నర్సింహులు, నందకుమార్, సాయిబాబా, చీఫ్ ఇంజనీర్ చక్రపాణి, సూపరింటెండింగ్ ఇంజనీర్లు గోపయ్య, వెంకన్న, డివిజనల్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

సిటీబ్యూరో, ఏప్రిల్19(నమస్తే తెలంగాణ): అగ్నిప్రమాదం జరిగితే ఏం చేయాలనే అవగాహన అందరికీ ఉండాల్సిన అవసరముందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఫైర్‌సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా శనివారం హైడ్రా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హైడ్రా ఫైర్ విభాగం అదనపు సంచాలకులు పాపయ్య, హైడ్రా ఎస్పీ సుదర్శన్, హైడ్రా ఫైర్ విభాగం రీజనల్ ఆఫీసర్ జయప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు ఒక ప్రస్థానం పుస్తకావిష్కరణ

సిటీబ్యూరో, ఏప్రిల్19. (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ యాభై ఏళ్ల ప్రయాణం గురించి రచయిత నూతి మల్లన్న రాసిన 'ఒక ప్రస్థానం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5 గంటలకు నెక్లస్‌రోడ్డ్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సామాజికవేత్తలు, విద్యావేత్తలు, పలువురు బీఆర్ఎస్ నేతలు హాజరుకానున్నారు.

వోక్స్ వ్యాగన్ టిగువాన్ ఆర్ లైన్ @ హైదరాబాద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): అత్యాధునికమైన ఎస్‌యూవీ టిగువాన్ ఆర్ లైన్‌ను వోక్స్ వ్యాగన్ డెక్కన్ షోరూమ్ శనివారం లాంచ్ చేసింది. ఎల్‌బీ నగర్, మెహిదీపట్నంలోని మోడీ వోక్స్ వ్యాగన్ డెక్కన్ షోరూమ్‌లలో ఈ కారును అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా జరిగిన గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌కి వోక్స్ వ్యాగన్ రీజినల్ మేనేజర్ ఉమేశ్ శర్మ, మోడీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పార్థ్ మోదీ, వోక్స్ వ్యాగన్ డెక్కన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్థ్ మోదీ మాట్లాడుతూ...''టిగువాన్ ఆర్ లైన్ మోడల్ వోక్స్ వ్యాగన్ ఇన్నొవేషన్, నాణ్యత పట్ల ఉన్న నిబద్ధతకు ప్రతిరూపం. హైదరాబాద్‌లోని మా కస్టమర్లకు ఈ ప్రీమియం కారును అందించడంపై మేం ఉత్సాహంగా ఉన్నాం'' అని తెలిపారు.

తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీగా నేటి నుంచి అధికారికంగా అమల్లోకి..

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 19: తెలంగాణ అస్తిత్వ ప్రకటనలో భాగంగా.. తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణకు, పరిపోషణకు విశేష కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి పెట్టడం స్ఫూర్తిదాయకంగా ఉందని వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హన్మంతరావు అన్నారు. వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల పక్షాన ముఖ్యమంత్రి గారికి వారు కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన కొద్దికాలంలోనే 2014లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని జయశంకర్ విశ్వవిద్యాలయంగా, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని కాళోజి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చుకోవడం జరిగిందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, వీరనారి చాకలి ఐలమ్మలాంటి తెలంగాణా వైతాళికుల పేర్లను కూడా రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు పెట్టడం జరిగిందని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికను ప్రారంభించి తెలంగాణ ప్రజలలో పోరాటపటిమను, తెగువను, చైతన్యాన్ని నింపిన ధైర్యశాలిగా అభివర్ణించారు. అలాంటి వ్యక్తి పేరును తెలుగు వర్సిటీకి పెట్టుకోవడం తెలంగాణ ప్రజలందరికీ ఇచ్చిన గౌరవంగా భావించవచ్చన్నారు.

అగ్నిమాపకశాఖకు అత్యాధునిక సామగ్రి

రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా

అగ్నిమాపక వాహనాలను ప్రారంభిస్తున్న డీసీపీ రవిగుప్తా, డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అగ్నిమాపకశాఖకు ఏ రాష్ట్రంలో లేనట్టుగా అత్యాధునిక సామగ్రిని సమకూర్చామని రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రవి గుప్తా అన్నారు. అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నూతన అగ్నిమాపక వాహనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అగ్నిమాపకశాఖ దక్షిణాదిలోనే తొలిసారిగా రోబోలను సమకూర్చుకున్నదని తెలిపారు. ప్రజలు, మూగజీవాల ప్రాణాలు కాపాడటంతోపాటు, ప్రజా ఆస్తులను రక్షించేందుకు నూతనంగా కొనుగోలు చేసిన యంత్ర సామగ్రి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాల నివారణ సమష్టి బాధ్యత అని చెప్పారు. ఫైర్ డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతివారం అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ని